సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం। 3। ఫిబ్రవరి। 2024



ఏదీ రక్షణ ?
గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ సిబ్బందికి ఉద్యోగ భద్రతతో పాటు ప్రాణ రక్షణ కూడా కొరవడుతోంది. 8లో



..డెయిరీతో పాలధారలు !
ఇందిరమ్మ డెయిరీతో మహిళలు, యువతకు ఉపాధి కల్పించాలనుకున్న డిప్యూటీ సీఎం భట్టి కల త్వరలో సాకారం కానుంది. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
33° / 17°

వాతావరణం
జిల్లాలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు కాస్త అధికంగానే నమోదవుతాయి. రాత్రివేళ మాత్రం వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్వర్ణకవచాలంకరణ
భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధార ణ గావించి ఆలయ అర్చకులు నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం జరిపించారు. తొలుత అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయం లోని మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, కుంకుమ పూజ గావించిన నివేదన, నీరాజన మంత్రపుష్పం, పంచహారతులు సమర్పించారు. ఆ తర్వాత గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు, చందుపట్ల శ్రీనివాసరెడ్డి, గంధం వెంగళరావు, కిలారు నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు సిద్ధం కావాలి



ఈడీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారులు

ఇల్లెందు: ములుగు జిల్లా మేడారంలో జరిగే సమ్మక్క – సారలమ్మ జాతరకు ఆర్టీసీ బస్సులు నడిపించనుండగా, అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ రఘునాధరావు సూచించారు. ఇల్లెందు డిపోను శుక్రవారం సందర్శించిన ఆయన అధికారులతో మాట్లాడారు. మేడారం వెళ్లే భక్తులు ఇబ్బంది పడకుండా బస్సులు సమకూర్చాలని తెలిపారు. కాగా, డిపోలో సదుపాయాల కల్పన, అదనపు బస్సుల కేటాయింపుపై అధికారులు విన్నవించగా ఈడీ సానుకూలంగా స్పందించారు. అధికారులు బాణాల వెంకటేశ్వర్లు, బి.సంజీవరాణి, వేమూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

6న సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు
కొత్తగూడెంటౌన్: జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న కొత్తగూడెంలోని సెయింట్ జేవీఎస్ స్కూల్‌లో క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కె.నవీన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులను ఈనెల 10, 11 తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు సాఫ్ట్‌బాల్ జిల్లా ఉప కార్యదర్శి సాయితేజ(77022 76718)ను సంప్రదించాలని కోరారు.

6 నుంచి డీఏఈ కల్చరల్ మీట్
అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో భారత అణుశక్తి విభాగం(డీఏఈ) స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ జాతీయ స్థాయి పోటీలు ఈనెల 6 నుంచి నిర్వహించనున్నారు. డీఏఈ విభాగంలోని యూనిట్లలో ఒక్కో ఏడాది ఒక్కో పోటీలు నిర్వహించనుండగా, ఈ సంవత్సరం మణుగూరు భారజల కర్మాగారం ఆధ్వర్యంలో కల్చరల్ మీట్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన కళాకారులు హాజరవుతారని పేర్కొన్నారు.

బెళగావికి వేళాయె

రాష్ట్ర రాజధానిలో పని చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అనువుగా ఉన్న బెళగావి ఎక్స్‌ప్రెస్‌ను మరోసారి రైల్వేశాఖ పునరుద్ధరించింది. ఈ రైలు ఆదివారం నుంచి బెళగావి – సికింద్రాబాద్ – భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) స్టేషన్ల మధ్య నడవనుంది.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



రేపటి నుంచి నడవనున్న ఎక్స్‌ప్రెస్
- మరోసారి పునరుద్ధరించిన రైల్వే శాఖ
- ఈ నెల వరకే ప్రకటించిన అధికారులు
- డిమాండ్ ఆధారంగా మళ్లీ పొడిగించే అవకాశం

ప్రయాణికులకు అనుకూల సమయం
ప్రస్తుతం జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానికి వెళ్లేందుకు రెండు రైళ్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో కాకతీయ ఎక్స్‌ప్రెస్ ఉదయం 5 గంటలకు సికింద్రాబాద్ వైపు బయలుదేరుతుంది. సాయంత్రం వేళ సికింద్రాబాద్ నుంచి భద్రాచలం రోడ్ స్టేషన్‌కు వస్తుంది. అయితే ఈ రైలుకు స్టాప్‌లు ఎక్కువగా ఉండడంతో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు అంతగా ఆదరించడం లేదు. ఇక మణుగూరు – సికింద్రాబాద్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పూర్తిగా రాత్రి వేళలోనే నడుస్తోంది. అయినా దీనికి డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. పలుమార్లు బెర్త్‌లు దొరకడమే కష్టంగా మారుతోంది. ఈ రెండు రైళ్లతో పాటు గతంలో మణుగూరు – కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉండేది. అయితే కరోనా సమయంలో ఈ రైలు రద్దయింది.

ఏడాది క్రితం ప్రారంభం..
కరోనా సంక్షోభం ముగిసిన తర్వాత గతేడాది జనవరి 17న కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు స్థానంలో బెళగావి – మణుగూరు – బెళగావి (07335/07336) ఎక్స్‌ప్రెస్ రైలును రైల్వేశాఖ ప్రకటించింది. అయితే ఇది మూన్నాళ్ల ముచ్చటగానే నిలిచింది. డోర్నకల్ – వరంగల్ మధ్య జరుగుతున్న మూడో లైన్ నిర్మాణ పనుల కారణంగా ఈ రైలు ప్రతీరోజు నిర్ణీత సమయానికి గమ్యాన్ని చేరుకోలేకపోయింది. దీంతో ఆరు నెలల క్రితం భద్రాచలం రోడ్ – మణుగూరు మధ్య ఈ రైలును రద్దు చేశారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. దీంతో భద్రాచలం రోడ్ – కాజీపేటల మధ్య కూడా రద్దు చేశారు. అప్పటి నుంచి సాయంత్రం వేళ కొత్తగూడెం నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు, ఉదయం వేళ హైదరాబాద్ నుంచి కొత్తగూడెం వచ్చేందుకు వీలుగా బెళగావి ఎక్స్‌ప్రెస్‌ను తిరిగి నడపాలంటూ జిల్లా వాసులు డిమాండ్ చేశారు.

కొత్తగూడెం వరకే
గతంలో మణుగూరు నుంచి రాకపోకలు సాగించిన బెళగావి ఎక్స్‌ప్రెస్‌ను ప్రస్తుతం భద్రాచలంరోడ్ (కొత్తగూడెం) వరకే పరిమితం చేశారు. ఈ శనివారం బెళగావిలో బయలుదేరనున్న రైలు సికింద్రాబాద్, కాజీపేట మీదుగా ఆదివారం ఉదయం 11:30 గంటలకు భద్రాచలంరోడ్ స్టేషన్‌కు చేరుతుంది. అదే రోజు సాయంత్రం 4:35 గంటలకు భద్రాచలంరోడ్‌లో బయలుదేరి కాజీపేట, సికింద్రాబాద్, లింగంపల్లి స్టేషన్ల మీదుగా బెళగావి వెళ్తుంది. కాజీపేట – భద్రాచలం రోడ్ మధ్య వరంగల్, కేసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్ స్టేషన్లలో ఆగుతుంది. కాగా, ఈనెల 4 నుంచి మార్చి 1 వరకే ఈ రైలును నడిపించేందుకు రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిస్థితులు అనువుగా ఉంటే మరోసారి పొడిగించే అవకాశం ఉంది.

గడల చూపు.. హస్తం వైపు



- కాంగ్రెస్ నుంచి ఎంపీ టికెట్ కోసం శ్రీనివాసరావు దరఖాస్తు
- ఖమ్మం, సికింద్రాబాద్ స్థానాలపై గురి
- గతంలో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా పోటీకి ఆసక్తి
- చివరి నిమిషంలో సీటు ఇవ్వని బీఆర్ఎస్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా రాజకీయాల్లో సంచలనంగా మారిన డాక్టర్ గడల శ్రీనివాసరావు పార్లమెంట్‌కు పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అందులో భాగంగా ఖమ్మం లేదా సికింద్రాబాద్ స్థానాల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేసే అంశాన్ని పరిశీలించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీకి దరఖాస్తు చేసుకున్నారు.

సంచలనాలకు కేరాఫ్..
జిల్లాకు చెందిన డాక్టర్ గడల శ్రీనివాసరావు అంచెలంచెలుగా ఎదుగుతూ ఉన్నత స్థాయికి చేరుకున్నారు. కరోనా సమయంలో హెల్త్ డైరెక్టర్ హోదాలో అందించిన సేవలతో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి రావాలనే తలంపుతో తన తండ్రి గడల సూర్య నారాయణ రావు (జీఎస్ఆర్) పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేశారు. కొత్తగూడెం నియోజకవర్గం కేంద్రంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, అప్పటి సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలతో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారారు. క్రిస్మస్, రంజాన్, బతుకమ్మ పండగల సందర్భంగా గడల చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. దీంతో అనతి కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందారు. కొత్తగూడెం నుంచి బీఆర్ఎస్ టికెట్ ఖాయమనే ప్రచారం ముమ్మరంగా సాగింది. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన వనమాకే తిరిగి బీఆర్ఎస్ టికెట్ ఇవ్వడంతో గడల ఆశలు నెరవేరలేదు.

ఇప్పుడు కాంగ్రెస్ నుంచి..
కరోనా అదుపులోకి వచ్చిన తర్వాత 2021 ఏప్రిల్, మే నుంచి 2023 ఆగస్టు వరకు గడల నిత్యం వార్తల్లో ఉంటూ వచ్చారు. దీంతో ఆయనను కాంగ్రెస్ నుంచి అసెంబ్లీకి పోటీ చేయించేందుకు గతంలో ప్రయత్నాలు జరిగాయనే ప్రచారం గుప్పుమంది. అయితే అది కార్యరూపం దాల్చలేదు. ఇరు వర్గాలు ఈ అంశంపై గుంభనంగానే వ్యవహరించాయి. కాగా, రాజకీయాల్లోకి రావాలనే బలమైన ఆకాంక్షతో ఉన్న గడల ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి పెట్టారు. దీంతో సికింద్రాబాద్, ఖమ్మం స్థానాల నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు ఆయన గాంధీభవన్‌లో శుక్రవారం దరఖాస్తులు సమర్పించారు. అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకున్న తర్వాత గత ఆగస్టు నుంచి ఇటీవలి వరకు ఉద్యోగ బాధ్యతలకే ఆయన పరిమితం అయ్యారు. ప్రస్తుతం గడల సెలవులో ఉన్నారు.

ఖమ్మానికి తీవ్రపోటీ..
ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి బరిలోకి దిగేందుకు కాంగ్రెస్ పార్టీలో తీవ్రమైన పోటీ నెలకొంది. అయితే వారిలో ఎక్కువ మంది ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారు. దీంతో బీసీ కోటాపై గడల నమ్మకం పెట్టుకున్నారు. మరోవైపు బీసీ కోటాలోనే ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు జిల్లాకు చెందిన మరో కాంగ్రెస్ నేత నాగ సీతారాములు కూడా దరఖాస్తు చేసుకున్నారు.

జిల్లాకు చేరుకున్న హరీశ్‌రావు



హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దిండిగాల రాజేందర్

ఇల్లెందు: మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావుకు శుక్రవారం జిల్లాకు చేరుకున్నారు. నేడు జరిగే భద్రాచలం, పినపాక నియోజకవర్గాల బీఆర్ఎస్ సమీక్షల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి భద్రాచలం వెళ్తున్న ఆయన.. ఇల్లెందులో గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ ఇంటికి రాగా, రాజేందర్‌తో పాటు పలువురు కార్యకర్తలు స్వాగతం పలికారు. తేనీరు స్వీకరించి, జిల్లా రాజకీయాల గురించి వారితో కాసేపు మాట్లాడిన తర్వాత తిరిగి ఆయన భద్రాచలం వెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాంనాయక్, రంగనాథ్, జబ్బార్, దేవీలాల్ నాయక్, అబ్దుల్ నబీ, మున్నాఫ్, సిలివేరు సత్యనారాయణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మందుల కొరత లేకుండా చూడాలి

డీఎంహెచ్‌ఓ శిరీష



మాట్లాడుతున్న డాక్టర్ శిరీష

పాల్వంచరూరల్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ఫార్మసిస్టులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష ఆదేశించారు. స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించి, ఆస్పత్రిలో మందుల నిల్వ వివరాలపై ఆరా తీశారు. అవసరమైన మందులకు ముందుగానే ప్రతిపాదనలు పంపించాలని, వచ్చిన మందులను నిల్వ చేయాలని చెప్పారు. వైద్యాధికారులతో సమన్వయం పాటించాలని సూచించారు. గడువు తేదీ ముగిసిన మందులను గుర్తించి వాటిని దూరంగా ఉంచాలన్నారు. మందుల నిల్వ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

21 మంది బాల కార్మికులకు విముక్తి

- పిల్లలతో వెట్టి చాకిరీ చేయిస్తే కఠిన చర్యలు
- ఎస్పీ రోహిత్‌రాజ్ హెచ్చరిక

కొత్తగూడెంటౌన్: ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ దుకాణాలు, ఇటుక బట్టీలు, ఇతర పరిశ్రమల్లో వెట్టి చాకిరీ చేస్తున్న 21 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించామని ఎస్పీ బి.రోహిత్‌రాజ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ టి.సాయిమనోహర్ ఆధ్వర్యంలో వివిధ పరిశ్రమలు, షాపులతో పాటు పలుచోట్ల తనిఖీలు నిర్వహించి పని చేస్తున్న బాలలను గుర్తించారని తెలిపారు. జిల్లాలో ఐదు బృందాలను ఏర్పాటు చేసి దాడులు నిర్వహించామని, నెల రోజుల పాటు జరిగిన ఈ ఆపరేషన్‌లో 21 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించామని పేర్కొన్నారు. ఇందులో ఏడుగురు బాలికలు, 14 మంది బాలురు ఉన్నారని, వీరిలో ఇతర రాష్ట్రాల వారు కూడా ఉన్నారని తెలిపారు. మొత్తంగా 15 కేసులు నమోదు చేశామని, గుర్తించిన వారిలో కొందరిని తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సిలింగ్ ఇచ్చామని వివరించారు. ఎవరైనా బాలలతో వెట్టిచాకిరీ చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఆపరేషన్ స్మైల్ బృందంలో పనిచేసి, బాల కార్మికులకు విముక్తి కలిగించిన ఆర్ఎస్సై రమాదేవి, ఎస్సై శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ నాగయ్య, పీసీలు మల్లికాంబ, శిరీష, రాంబాబును ఎస్పీ అభినందించారు.

సైన్స్‌ఫేర్‌లో జిల్లాకు నాలుగు బహుమతులు

కొత్తగూడెంఅర్బన్: జనవరి 28 నుంచి ఈనెల ఒకటో తేదీ వరకు విజయవాడలో జరిగిన దక్షిణ భారత సైన్స్ ఫేర్‌లో జిల్లాకు నాలుగు బహుమతులు లభించాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరా చారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్‌ఫేర్‌కు రాష్ట్రవ్యాప్తంగా 25 ప్రాజెక్టులు ఎంపిక కాగా, వీటిలో నాలుగు జిల్లా నుంచి ఉన్నాయని, అందులో మూడు ప్రాజెక్టులకు బహుమతులు లభించాయని పేర్కొన్నారు. కొత్తగూడెం త్రివేణి పాఠశాల విద్యార్థినులు దీప్షిక, హర్షిత లిక్విడ్ ట్రీ అనే ఎగ్జిబిట్‌ను ప్రదర్శించగా, గ్రూప్ విభాగంలో ద్వితీయ బహుమతి లభించిందని, చంద్రుగొండ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి రామ్‌చరణ్ రూపొందించిన స్మార్ట్ హెల్మెట్‌కు ప్రత్యేక బహుమతి వచ్చిందని వివరించారు. ఇల్లెందు సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థి వరుణ్‌కుమార్ రూపొందించిన స్మార్ట్ అగ్రిరోబోకు వ్యక్తిగత విభాగంలో తృతీయ బహుమతి లభించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి, తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలు బెంగళూరు వీఐటీఎం ఆధ్వర్యంలో జరిగాయని తెలిపారు. విద్యార్థులకు గైడ్ టీచర్లుగా పి.జ్యోతి, ఎండీ.వాహిద్, ఎం.విష్ణుప్రియ వ్యవహరించారని, రాష్ట్ర ఎస్‌సీఈఆర్టీ నుంచి డీఎస్‌ఓ ఎస్.చలపతిరాజు కన్వీనర్‌గా వ్యవహరించారని వివరించారు. ఈ సందర్భంగా చలపతిరాజుకు అప్రిసియేషన్ సర్టిఫికెట్, మెమెంటో అందజేసిన డీఈఓ ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఎంసీహెచ్‌లో ఎన్నో సమస్యలు

- అందుబాటులో లేని రక్త నిల్వ కేంద్రం
- అత్యవసర సమయాల్లో గర్భిణుల ఇక్కట్లు
- పరీక్షలకూ సర్వజన ఆస్పత్రే దిక్కు



కొత్తగూడెంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని త్రీ ఇంక్లైన్ పంచాయతీలోని మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెరుగుతున్నా.. సమస్యలు మాత్రమ పరిష్కారం కావడం లేదు. గర్భిణులకు సర్జరీ చేయాల్సి వస్తే వారిలో రక్తం ఎంత శాతం ఉందో తెలుసుకోవడం అతి ముఖ్యమైన అంశం. తక్కువగా ఉన్నవారికి ఎక్కించేందుకు బ్లడ్ బ్యాంక్ లేదు.. రక్త పరీక్షలు చేసేందుకు హబ్ కూడా లేదు. అవసరమైతే సేకరించిన నమూనాలను సర్వజన ఆస్పత్రిలోని టీ హబ్‌కు పంపించాల్సి వస్తోంది. ఇలా పరీక్ష ఫలితాలు ఆలస్యం కావడంతో అప్పటికే నష్టం జరిగిపోతోంది.


రిపోర్టులకు మూడు రోజులు..
గర్భిణులకు బ్లడ్ గ్రూప్, ర్యాండమ్ బ్లడ్ షుగర్, హెచ్‌బీఎస్‌ఏజీ, వీడీఆర్ఎల్, హెచ్ఐవీ, థైరాయిడ్, యూరిక్ యాసిడ్, ఎల్ఎఫ్‌టీ (లివర్ ఫంక్షన్ టెస్ట్) ఆర్ఎఫ్‌టీ తదితర పరీక్షలు చేయాల్సి ఉంటుంది. అయితే ఎంసీహెచ్‌లో హెచ్ఐవీ, ఆర్‌బీఎస్, హెచ్‌బీ, బ్లడ్ గ్రూప్ పరీక్షలు మాత్రమే చేస్తున్నారు. మిగతా వాటికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సర్వజన ఆస్పత్రే దిక్కు. దీంతో రిపోర్టులు రావడానికి కనీసం మూడు రోజులు పడుతోంది. తద్వారా చికిత్సకు జాప్యం జరుగుతోంది.

మిడ్ వైఫరీలే వైద్యులు..
మాతా శిశు సంరక్షణ కేంద్రానికి వచ్చే గర్భిణులకు ఎనిమిదో నెల వచ్చేవరకు కూడా మిడ్ వైఫరీలే వైద్య సేవలు అందిస్తున్నారని, 9వ నెల వచ్చాకే వైద్యులు చికిత్స చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. స్త్రీ వైద్య నిపుణులు సేవల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎంసీహెచ్‌కు నిత్యం 200 మంది వరకు గర్భిణులు వస్తుంటారు. వీరికి పరీక్షలు చేయడంలో వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మాతాశిశు సంరక్షణ కేంద్రంలో నెలకు సుమారు 350 మంది డెలివరీ అవుతున్నారు. అయితే వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో గర్భిణులకు సరైన సేవలు అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వారు సక్రమంగా పనిచేస్తే ప్రసవాల సంఖ్య ఇంకా పెరుగుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. కలెక్టర్ ప్రియాంక ఆల ఇటీవల జిల్లా వైద్యారోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్, జిల్లా సర్వజన ఆస్పత్రి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, గర్భిణుకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా పరిస్థితి పెద్దగా మారలేదని తెలుస్తోంది.

బస్టాప్ లేక ఇక్కట్లు..
మాతా శిశు సంరక్షణ కేంద్రానికి ఇరువైపులా సమీపంలో బస్టాప్ లేదు. దీంతో ఆర్టీసీ బస్సులు అక్కడ ఆగడం లేదని, దూర ప్రాంతాల నుంచి వస్తున్న మహిళలు, గర్భిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్ల, వెంకటాపురం, తల్లాడ, ఏన్కూరు, దమ్మపేట, సత్తుపల్లి, ఆశ్వారావుపేట, మణుగూరు, పినపాక, బయ్యారం, ఇల్లెందు తదితర ప్రాంతాల నుంచి వచ్చే గర్భిణులు బస్సు దిగిన తర్వాత ఇక్కడికి చేరుకోవడం కష్టమవుతోంది. అధికారులు స్పందించి ఎంసీహెచ్ వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇటీవలే తల్లీ బిడ్డ మృతి
సుజాతనగర్ మండలం నాయకులగూడెం గ్రామానికి చెందిన సింధు ప్రసవం కోసం జనవరి 24న మాతా, శిశు సంరక్షణ కేంద్రానికి వచ్చింది. వైద్యులు రక్త పరీక్ష చేయాలని సూచించగా, సిబ్బంది రక్తం సేకరించి కొత్తగూడెంలోని సర్వజన ఆస్పత్రిలోని టీ హబ్‌కు పంపించారు. అయితే అక్కడి నుంచి రిపోర్టు రావడం ఆసల్యమైందని, అప్పటికే కడుపులో బిడ్డ మృతిచెందిందని, సకాలంలో ఆపరేషన్ చేయకపోవడంతో సింధు కూడా ప్రాణాలు కోల్పోయిందని ఆమె కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ ఘటనకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని వారు అంటుండగా, డీఎంఈ ఆదేశాల మేరకు ముగ్గురు వైద్యుల బృందం తాజాగా విచారణ చేపట్టింది.

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారులు



గౌతంపూర్ పంచాయతీలో బాధ్యతలు స్వీకరిస్తున్న చుంచుపల్లి ఎంపీఓ సత్యనారాయణ

చుంచుపల్లి: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు జిల్లాలోని 481 జీపీల పరిధిలో 218 మంది గెజిటెడ్ అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్లు గ్రామ పంచాయతీల రికార్డులను పరిశీలించి కార్యదర్శుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణతో పాటు రోజువారీ చేపట్టాలిస్న పనులు గురించి కార్యదర్శులతో చర్చించారు. ఇకపై అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఖర్చు చేయాలంటే ప్రత్యేకాధికారితో పాటు కార్యదర్శి పేరిట జాయింట్ చెక్ పవర్ ఉంటుంది.

12 నుంచి మాఘమాసోత్సవాలు



శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఈనెల 12 నుంచి మాఘ మాసోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 16 వరకు భక్త రామదాసు జయంతి సందర్భంగా వాగ్గేయకారోత్సవాలు నిర్వహిస్తామని, 21న కులశేఖరాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా శ్రీ స్వామివారి ఉత్సవ మూర్తులతో పాటు ఆళ్వారుకు స్నపన తిరుమంజనం, రాత్రి విశేష భోగం (ఏదైన మధుర పదార్థం) నివేదన ఉంటాయని వివరించారు. ఈనెల 23, 24 తేదీల్లో సహస్ర కళశాభిషేకం కార్యక్రమాలు ఉంటాయని, ఆ రెండు రోజులు నిత్యకల్యాణాలు నిలిపివేస్తామని పేర్కొన్నారు.

నేడు, రేపు 'గేట్'

సుజాతనగర్ : స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ఐఐటీ బెంగళూరు ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో గేట్ -2024 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామని కళాశాల యాజమాన్యం వారు తెలిపారు. శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్‌లో 45 మంది, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరిగే రెండో సెషన్ పరీక్షకు 123 మంది అభ్యర్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ఇక ఆదివారం జరిగే పరీక్షకు రెండు విడతల్లో కలిపి 240 మంది హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డుతో పాటు, ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకుని రావాలని, సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్లు, రిస్ట్ వాచ్ వంటి ఎల్రక్టానిక్ పరికరాలను అనుమతించబోమని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

కురుమల సంక్షేమానికి కృషి

ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్య



మాట్లాడుతున్న ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్య

పాల్వంచరూరల్: కురుమల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం కురుమ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన కురుమ సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పెద్దమ్మతల్లిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉండాలని సూచించారు. తొలుత ఎమ్మెల్యేను కురుమ సంక్షేమ సంఘం ఆధ్వరంయలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొమరవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్, కంచి ప్రభాకర్, దూడల బుచ్చయ్య, సంఘం అధ్యక్షుడు కాకర్ల శ్రీను, ఉపాధ్యక్షుడు కొలే సాయికుమార్, ప్రధాన కార్యదర్శి పేరం కుమార్, చేరాలు, ఎలకపల్లి వెంకటేష్, గట్టయ్య, రాములు, లింగయ్య, రామచంద్రు, సదానందం, పి.గుట్టయ్య, కుమార్, జగదీష్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్నిక



ఎంపిక పత్రాన్ని అందుకుంటున్న ఎంఏ జిలానీ

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ మెడికల్, హెల్త్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అశ్వారావుపేట సిహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎంఏ జిలానీ ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదారాబాద్‌లోని సచివాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ఎంపిక పత్రాన్ని రాష్ట్ర బాధ్యుల చేతుల మీదుగా అందుకున్నారు. రాష్ట్ర కమిటీలో చోటు దక్కించుకోవడం పట్ల స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, తోటి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

గణేష్ టెంపుల్ హుండీ ఆదాయం రూ.5.54 లక్షలు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం (గణేష్ టెంపుల్) హుండీలను శుక్రవారం లెక్కించారు. మొత్తంగా రూ.5,54,313 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కె.సులోచన తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవాదాయ, పోలీస్ శాఖలతో పాటు బ్యాంక్ సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సింగరేణి ఉపాధ్యాయుడి బదిలీ

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాహై సూక్ల్ ఉపాధ్యాయుడు వీరన్నను గోలేటికి బదిలీ చేస్తూ యాజమాన్యం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా వ్యవహరించాడనే ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఏపీ పోలీసుల అదుపులో పేరాయిగూడెం యువకుడు

అశ్వారావుపేటరూరల్: ఇన్‌స్టాగాం ద్వారా పరిచయమైన యువకుడిని ప్రేమించిన బాలిక అతని వద్దకు రాగా, బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సదరు యువకుడిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికుల, పోలీసుల కథనం ప్రకారం..ఏపీలోని విశాఖపట్నం జిల్లాకు చెందిన ఓ మైనర్ బాలికకు కొద్ది రోజుల క్రితమే అశ్వారావుపేట మండలంలోని పేరాయిగూడేనికి చెందిన ఓ యువకుడితో ఇన్‌స్టాగాం ద్వారా పరిచయం ఏర్పడింది. రీల్స్, చాటింగ్, లైక్‌లు, షేర్‌లు కాస్తా ప్రేమకు దారి తీయగా, రెండు రోజుల క్రితం బాలిక ప్రియుడి వద్దకు వచ్చేసింది. తాను ప్రేమించిన యువకుడి వద్దకు వచ్చానని, తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజాము సమయంలో ఏపీ నుంచి వచ్చిన పోలీసులు యువకుడితోపాటు, మైనర్ బాలికను అదుపులోకి తీసుకుని తీసుకెళ్లారు. ఈ ఘటనపై ఎస్‌ఐ పి.శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. మిస్సింగ్ కేసులో భాగంగా ఏపీ పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు.

వాహనాలను దగ్ధం చేసిన మావోయిస్టులు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టులు శుక్రవారం వాహనాలకు నిప్పంటించి దగ్ధం చేశారు. నారాయణపూర్ జిల్లాలో రోడ్డు పనులను నిర్వహిస్తున్న వాహనాలను నిలిపివేసి, నిప్పంటించారు. దీంతో ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్, మిక్చర్ మిషన్‌లు దగ్ధమయ్యాయి. కాగా కాంట్రాక్టర్‌కు సుమారు రూ.50 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది.

ఏదీ రక్షణ..?

మల్టీపర్పస్ వర్కర్లపై పాలకుల చిన్నచూపు

- గ్రామ పంచాయతీల్లో అన్ని పనులూ వారితోనే..
- విధి నిర్వహణలో రెండేళ్లలో నలుగురి మృతి
- ప్రాణ రక్షణ, ఉద్యోగ భద్రత కరువు





వీధుల్లో తిరుగుతూ చెత్త సేకరిస్తున్న మల్టీ పర్పస్ కార్మికులు

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు ఉద్యోగ భద్రత, ప్రాణరక్షణ కొరవడింది. విధి నిర్వహణలో మృతి చెందినా ప్రభుత్వం నుంచి సాయం అందడంలేదు. జిల్లా వ్యాప్తంగా 479 గ్రామపంచాయతీల పరిధిలో 1,601 మంది మల్టీపర్పస్ వర్కర్లు పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో అనారోగ్యానికి గురై పలువురు మృత్యువాత పడుతుండగా, గడిచిన రెండేళ్లలో నలుగురు కార్మికులు ప్రమాదాలకు గురై మృతిచెందారు. గుండాల మండలం ముత్తాపురం గ్రామపంచాయతీకి చెందిన పూనెం బుచ్చయ్య, పూనెం వసంతరావు రెండేళ్ల క్రితం ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో మృత్యువాతపడ్డారు. ఏడాది క్రితం టేకులపల్లి మండలం చుక్కాలబోడు గ్రామపంచాయతీకి చెందిన వెంకటేష్ విద్యుదాఘాతానికి గురై, నెల రోజుల క్రితం గుండాల మండలం సాయినపల్లి గ్రామపంచాయతీకి చెందిన బొమ్మెర రాంమూర్తి ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో మృతిచెందారు.

అనారోగ్యం, ప్రమాదాలు..

గ్రామపంచాయతీల్లో ఇంటింటాచెత్త సేకరణ, మొక్కలు నాటడం, నీరు అందించడం, ఇంటింటికీ నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, ఇంటి పన్నుల వసూలు, బ్లీచింగ్ చల్లడం, కాల్వలు శుభ్రం చేయడం, వీధుల్లో ఏపుగా పెరిగిన మొక్కలు తొలగించడం, అనాథ శవాల అంత్యక్రియలు, మూగ జీవాల ఖననం, సభలు, సమావేశాలు తదితర పనులు మల్టీపర్పస్ వర్కర్లతోనే చేయిస్తున్నారు. శిక్షణ లేకుండానే వీరికి ప్రమాదకర పనులు అప్పగిస్తున్నారు. లైసెన్స్ లేకుండానే ట్రాక్టర్ డ్రైవర్లుగా వినియోగించుకుంటున్నారు. ఇల్లెందు మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలో 14 మంది ట్రాక్టర్ డ్రైవర్లు లైసెన్స్ లేకుండా విధుల్లో కొనసాగుతున్నారు. ఎలక్ట్రీషియన్‌గా కనీస శిక్షణ లేకపోయినా విద్యుత్ మరమ్మతు పనులు చేయిస్తున్నారు. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ముక్కుపుటలదిరే ప్రదేశాల్లోనూ విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యానికి గురవుతున్నారు.

కొత్త ప్రభుత్వంపైనే ఆశలు..

వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్మికులు 2023 జూలై 6వ తేదీ నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు సమ్మె చేపట్టారు. వీరి ఆందోళనకు అప్పటి ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ నేతలు సంఘీభావం తెలిపారు. అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ప్రతీ కార్మికునికి రూ.5 లక్షలు ఇన్సూరెన్స్ చేయిస్తామని ప్రకటించింది. కానీ ఆ హామీలు అమలుకు నోచుకోలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధుల్లో మల్టీపర్పస్ కార్మికుల రక్షణకు ఒక్క శాతం కేటాయించిన దాఖలాలు లేవు. గ్రామపంచాయతీలకు అవార్డులొస్తే సంబురపడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు.. చెత్తాచెదారంలో, ప్రమాదకర పరిస్థితిలో పనిచేస్తున్న వీరిని పట్టించుకోవడం లేదు. నూతనంగా కొలువుదీరినా కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ సమస్యలు పరిష్కరిస్తుందని మల్టీపర్పస్ వర్కర్లు ఆశలు పెట్టుకున్నారు.

ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి



గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ పద్ధతిని రద్దు చేయాలి. ప్రతీ కార్మికుడికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ వర్తింపజేయాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. మృతి చెందిన కార్మిక కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి.

–జి.వెంకన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్

మల్టీపర్పర్స్ పేరుతో విధుల్లోకి తీసుకున్నాం



గ్రామపంచాయతీల్లో అన్ని పనులు చేసేలా కార్మికులను మల్టీపర్పస్ పేరుతో విధుల్లోకి తీసుకున్నాం. సగం మందికి పైగా డ్రైవర్లకు లైసెన్సులు ఉన్నాయి. కార్మికులందరికీ రక్షణ సామగ్రి ఇవ్వాలని పంచాయతీలను ఆదేశించాం. ఇన్సూరెన్స్ సౌకర్యం ప్రభుత్వ పరిధిలో ఉంది.

–లక్ష్మీరమాకాంత్, జిల్లా పంచాయతీ అధికారి

సంచలనం రేకెత్తించిన 'శిశు మార్పిడి'

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఐసీడీఎస్ అధికారులు
- ఆస్పత్రి యాజమాన్యం ప్రమేయం లేదని ఐఎంఏ వెల్లడి



గ్రామపంచాయతీ రికార్డుల్లో వివరాలు వెల్లడిస్తున్న ఐఎంఏ బృందం

భద్రాచలం: భద్రాచలంలో 'శిశు మార్పిడి' వ్యవహారం శుక్రవారం సంచలనం రేకెత్తించింది. భద్రాచలం కేంద్రంగా శిశుమార్పిడి జరిగిందని, దీని వెనుక ఓ ఆస్పత్రి యాజమాన్యం ఉందంటూ ఆరోపణలు, సోషల్ మీడియాలో ప్రచారం సాగటంతో జిల్లా అధికార యంత్రాంగం కూడా దృష్టి సారించింది. ఈ సంఘటనపై ఐసీడీఎస్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, శిశువు తల్లి తరపు బంధువులు, భద్రాచలం ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌లు మరో రకంగా స్పందించటంతో వ్యవహారం అనేక మలుపులుగా తిరిగింది.

ఆర్థిక భారంతోనే శిశువును ఇచ్చాం..

శిశు మార్పిడి మూడు నెలల క్రితమే జరిగిన మాట వాస్తవమేనని శిశువు తల్లి తరపు బంధువులు పేర్కొంటున్నారు. తెలిసిన మిత్రుల ద్వారా బెంగళూరుకు చెందిన ఓ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి సంప్రదించారని చెబుతున్నారు. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులు, శిశువు తండ్రి మృతి చెందడం, ఇతర కుటుంబపరమైన సమస్యలతో శిశువు పోషణ భారంగా మారుతుందని కుటుంబ సభ్యులందరం చర్చించుకుని, ఎటువంటి డబ్బులు తీసుకోకుండా ఆ ఉద్యోగికి ఇచ్చామని వెల్లడించారు. అయితే ఆ శిశువుకు జన్యుపరమైన లోపంతో అనారోగ్య సమస్యలు తలెత్తగా, తిరిగి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కొత్తగూడెంలోని ఐసీడీఎస్ అధికారులను సంప్రదించారని, దీనికి పూర్తి బాధ్యత తనదేనని లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారని వారు పేర్కొంటున్నారు. కాగా ఆస్పత్రి యాజమాన్యం మరణ ధ్రువీకరణ పత్రం ఇచ్చిందనే ప్రచారంపై వివరణ ఇస్తూ.. ఈ సంఘటనకు ఆస్పత్రి యాజమాన్యానికి ఎలాంటి సంబంధం లేదని, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటికి వచ్చిన క్రమంలో శిశువు మృతి చెందినట్లుగా నమోదు చేసుకున్నారని చెబుతున్నారు.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఖండన

రెండు రోజులుగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా నిరాధారమైనదని భద్రాచలం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.మోహన్ రావు, సెక్రటరీ ఎం.రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఐఎంఏ బృందంతో కలిసి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆస్పత్రికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విచారణలో తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని, డెలివరీ అనంతరం డిశ్చార్జ్ చేశారని తేలిందని పేర్కొన్నారు. జనన పత్రం, గ్రామపంచాయితీకి పంపే ధ్రువీకరణ పత్రంలో సరైన వివరాలు ఉన్నాయని, డెత్ సర్టిఫికెట్ ఇచ్చారనే ఆరోపణలు అవాస్తవమని వెల్లడించారు. ఇటువంటి వార్తలను ప్రచారం చేసే విషయంలో వివరణలతో పేర్కొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సభ్యులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశాం

ఈ సంఘటనపై గతంలోనే మాకు ఫిర్యాదు అందింది. శిశువును తీసుకున్న ఉద్యోగినే డీసీపీఓను సంప్రదించగా, లిఖిత పూర్వక ఫిర్యాదు తీసుకుని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ బృందం సహకారంతో మా శాఖ తరుపున విచారణ చేపట్టాం. నివేదికను ఉన్నతాధికారులకు అందచేశాం. విచారణ జరపాలని శుక్రవారం భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో మా శాఖ తరపున ఫిర్యాదు చేశాం. పోలీసుల విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడవుతాయి.

– వేల్పుల విజేత, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి

వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ పోస్టు ఖాళీ..



పాల్వంచ వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ కార్యాలయం

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లాలో ఉన్న ఏకైక వన్య మృగాల సంరక్షణ విభాగానికి మూడు నెలలుగా అటవీశాఖ డివిజన్ అధికారి(ఎఫ్‌డీఓ) లేరు. అయినా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు. పాల్వంచలోని వైల్డ్‌లైఫ్ డివిజన్ అధికారిగా ఉన్న కట్టా దామోదర్‌రెడ్డి గతేడాది నవంబర్‌లో పాల్వంచ టెరిటోరియల్ డివిజన్ ఎఫ్‌డీఓగా బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి ఎఫ్‌డీఓగా డీఎఫ్ఓ కృష్ణగౌడ్ విధులు నిర్వర్తిస్తున్నారు. మూడునెలలుగా ఎఫ్‌డీఓ పోస్టు ఖాళీగా ఉండటంతో పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తున్నా పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ పోస్టు కోసం గతంలో పాల్వంచ డివిజన్ ఎఫ్‌డీఓగా పనిచేసిన సుజాత, మహబూబాబాద్ ఎఫ్‌డీఓ కృష్ణమాచారి పోటీపడుతున్నట్లు సమాచారం.

జూనియర్ అసిస్టెంట్లు త్వరలో విధుల్లోకి..

కొత్తగూడెం ఎమ్మెల్యే చొరవతో సింగరేణి యాజమాన్యం ప్రకటన

సింగరేణి(కొత్తగూడెం): కొన్ని నెలల క్రితం నియమితులైన జూనియర్ అసిస్టెంట్లను ఈ నెల రెండో వారంలో విధుల్లోకి తీసుకుంటామని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ప్రకటించినట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్లుగా ఎంపికైన 146 మందిని ఎన్నికల కోడ్ పేరుతో విధుల్లోకి తీసుకోకపోవడంతో ఆందోళన చెందుతున్నారంటూ ఎమ్మెల్యే గత నెల 23న సీఎండీని కలిసి వివరించారు. దీంతో సీఎండీ స్పందించి విధుల్లోకి తీసుకుంటామని ప్రకటించడం హర్షణీయమని పేర్కొన్నారు. నాలుగు నెలలుగా సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న సుమారు 400 మంది డిపెండెంట్ ఉద్యోగులకు కూడా త్వరలో పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. గతేడాది ప్రకటిస్తామన్న సుమారు 350 పోస్టుల ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని కోరారు.

● పర్ణశాల పంచవటిలో మరమ్మతులు



పంచవటిలో పనులు చేస్తున్న కార్మికులు

దుమ్ముగూడెం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల దేవాలయంలోని పంచవటి కుటీరంలో విగ్రహాల మరమ్మతు పనులను శుక్రవారం ప్రారంభించారు. విగ్రహాలు శిథిలావస్థకు చేరుకోగా దేవస్థానం ఈఓ ఎల్.రమాదేవి చొరవ తీసుకుని తిరుపూరు నుంచి మేస్త్రీలను పిలిపించి పనులను చేపట్టారు. కుటీరం సైతం శిథిలావస్థకు చేరుకుని, వర్షాకాలంలో కురుస్తుండటంతో దానిని సైతం పూర్తిగా తొలగించి నూతన కుటీరం నిర్మించే పనులు చేపట్టారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం దేవస్థానానికి అనుబంధ ఆలయంగా ఉన్న పర్ణశాలలో కొంతకాలంగా సరైన పర్యవేక్షణ లేక పంచవటి కుటీరంలో ఉన్న విగ్రహాలు విరిగి, రంగు వెలిసిపోయాయి. దీంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా దేవస్థానం అధికారులు గుర్తించి విగ్రహాల మరమ్మతులు చేపట్టారు.

దమ్మపేట సొసైటీ చైర్మన్‌గా రాఘవరావు

గత చైర్మన్‌పై అవిశ్వాసం, ఏకగ్రీవంగా కొత్త చైర్మన్ ఎన్నిక



సొసైటీ చైర్మన్‌కు నియామక పత్రం అందజేస్తున్న డీసీఓ వెంకటేశ్వర్లు

దమ్మపేట: దమ్మపేట కోపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా నాచారం గ్రామానికి చెందిన డైరెక్టర్ ఎల్లిన రాఘవరావు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పది రోజుల కిందట జిల్లా కోపరేటివ్ అధికారి వెంకటేశ్వర్లు అవిశ్వాస తీర్మాన నోటీసులను పంపారు. కాగా బుధవారం సొసైటీ చైర్మన్ రావు జోగేశ్వర రావు తన పదవికి రాజీనామా చేసినప్పటికీ, ఆ రాజీనామాను ఇంకా ఆమోదించలేదు. అయితే ముందుగా ఇచ్చిన నోటీసుల ప్రకారం శుక్రవారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం సొసైటీ చైర్మన్ ఎన్నిక నిర్వహించగా 13 మంది డైరెక్టర్లలో 11 మంది హాజరై రాఘవరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన చైర్మన్‌తో డీసీఓ వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోటగిరి సత్యంబాబు, అలపాటి రామచంద్రప్రసాద్, రావు గంగాధర రావు, చిన్నశెట్టి యుగంధర్, ఎల్లిన మురళి, కక్కిరాల రమేష్, పగడాల రాంబాబు, కేవీ సత్యనారాయణ, యర్రగొర్ల రాధకృష్ణ, సాయిల నర్సీ, రావు రవిశంకర్, పర్వతనేని ప్రసాద్, శ్రీరాముల ప్రసాద్, చిన్నశెట్టి చిట్టిబాబు, పగడాల కృష్ణారావు, కందుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దారిమళ్లిన పంచాయతీ నిధులు

సర్పంచ్ సంతకం ఫోర్జరీపై కొనసాగుతున్న విచారణ

ఇల్లెందురూరల్: అధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామపంచాయతీల ఖజానాకు చిల్లు పడుతోందని తెలుస్తోంది. మండలంలోని సుదిమళ్ల గ్రామపంచాయతీలోనూ ఇలాంటి ఘటన వెలుగు చూసింది. ఇక్కడి కార్యదర్శి ఏకంగా సర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నిధులు డ్రా చేసినట్లు తెలిసింది. గ్రామ పంచాయతీ నిధులు డ్రా చేయాలంటే గ్రామపంచాయతీ తీర్మానం, చెక్కుపై సర్పంచ్, ఉపసర్పంచ్ సంతకం అవసరమవుతాయి. కాగా, ఎస్‌ఆర్ ఈజీఎస్ అకౌంట్ చెక్కులపై మాత్రం సర్పంచ్, కార్యదర్శి సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఈ నిధులపై ఆడిట్ లేకపోవడంతో సుదిమళ్ల సర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి డీజిల్ కోసం రూ.37వేలు చెక్కు జారీచేశారు. ఈ వ్యవహారం అక్టోబర్‌లో జరగగా అప్పటికే రూ.20వేలు తీసుకోవడం, మళ్లీ రూ.37వేల చెక్కు జారీ చేయడం గమనార్హం. అంతేకాక ఇంకుడు గుంత పూర్తయిన లబ్ధిదారుడికి గ్రామపంచాయతీ ద్వారా రూ.16వేల చెక్కు ఇవ్వాల్సి ఉండగా.. మల్టీపర్పస్ వర్కర్ పేరిట చెక్కు రాసి ఆ ఖాతా నుంచి కార్యదర్శి తన సొంత ఖాతాలోకి మళ్లించుకున్నాడు. కాగా, సుదిమళ్ల కార్యదర్శి గణతంత్ర వేడుకల తర్వాత కార్యాలయానికి రావడం మానేశారు. అంతకుముందే అక్రమాలు వెలుగుచూడటంతో ఎంపీడీఓ బాలరాజు జనవరి 3న మెమో సిద్ధం తీసుకెళ్లాలని సూచించగా కార్యదర్శి నిరాకరించాడు. దీంతో ఈనెల 1వ తేదీన మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీకాంత్ స్వయంగా గ్రామపంచాయతీకి వెళ్లి అందజేసి 24 గంటల్లో సమాధానం చెప్పాలని ఆదేశించారు. అయినా శుక్రవారం వరకు సమాధానం అందలేదు. ఈ విషయమై ఎంపీడీఓ బాలరాజును వివరణ కోరగా సుదిమళ్ల గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగం, సర్పంచ్ సంతకం ఫోర్జరీపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. కార్యదర్శి శుక్రవారం సాయంత్రానికి వివరణ ఇవ్వాల్సి ఉన్నా అందకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్య తీసుకుంటామని పేర్కొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి

- రోజూ 2.3 లక్షల టన్నుల బొగ్గు వెలికితీయాలి
- సింగరేణి సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని ఎట్టిపరిస్థితుల్లో సాధించాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బొగ్గు ఉత్పత్తి, పురోగతి, నూతన ప్రాజెక్ట్‌లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. మిగిలిన రెండు నెలల కాలంలో ఇంకా 140 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. రోజుకు కనీసం 2.3 లక్షల టన్నులకు తగ్గకుండా బొగ్గు వెలికితీయాలన్నారు. ఆర్థిక సంవత్సరంలో మొదటి 10 నెలల కాలంలో 56.3 మిలియన్ టన్నులు సాధించామని చెప్పారు. ఈ ఏడాది ఇప్పటివరకు 344 మిలియన్ క్యుబిక్ మీటర్ల ఓవర్‌బర్డెన్ తొలగించామని తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు డి. సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్, జి.వెంకటేశ్వరరెడ్డి, అధికారులు జే.అల్విన్, ఎం.సురేష్, జక్కం రమేష్, జి. దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో కేసు నమోదు

దమ్మపేట: వ్యవసాయ క్షేత్రంలోకి అక్రమంగా చొరబడి, విధ్వంసానికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని దమ్మపేట గ్రామానికి చెందిన తాండ్ర వెంకట రామనర్సింహారావుకు ముష్టిబండ గ్రామ రెవెన్యూ పరిధిలో వ్యవసాయ క్షేత్రం ఉండగా, మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. బుధవారం సాయన్నరావుపాలెం గ్రామానికి చెందిన నందమూరి సత్యనారాయణ, నందమూరి రాములు, భూవివాదాల కారణంగా ఆ వ్యవసాయ క్షేత్రంలోనికి అక్రమంగా ప్రవేశించి, రూ.30 వేల విలువైన ఫెన్సింగ్ రాళ్లను ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

రైస్ మిల్లు యజమానిపై...

దమ్మపేట: ధాన్యం మిల్లింగ్ చేయగా తక్కువ బియ్యం వస్తున్న ఘటనలో రైస్ మిల్లు యజమానిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... దమ్మపేట గ్రామంలోని మురళీకృష్ణ రైస్ మిల్లును అదే గ్రామానికి చెందిన కొంకా శ్రీనివాసరావు నిర్వహిస్తున్నారు. గురువారం మందలపల్లి గ్రామానికి చెందిన కొండపల్లి జగపతి అనే వ్యక్తి ధాన్యం మిల్లు ఆడించగా, రావలసిన పరిమాణం కంటే తక్కువ బియ్యం వచ్చాయి. దీంతో నిర్వాహకుడు శ్రీనివాసరావును ప్రశ్నించగా, సరైన సమాధానం ఇవ్వకుండా బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు. కాగా బాధితుడి ఫిర్యాదు మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి రుక్మిణి రైస్ మిల్లులో తనిఖీ చేశారు. నివేదిక ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు డీఎస్ఓ పేర్కొన్నారు.

లిఫ్ట్ ఇస్తామంటూ దోపిడీ

- వృద్ధ దంపతుల నుంచి బంగారుగొలుసు, నగదు చోరీ
- మాటల్లో పెట్టి మోసం చేసిన దుండగులు



దాడికి గురైన వృద్ధ దంపతులు

తల్లాడ/వైరా: లిఫ్ట్ ఇస్తామని చెప్పి వృద్ధ దంపతులను తీసకెళ్తూ బంగారు నానుతాడు, రూ.5 వేలు నగదు లాక్కుని వాహనం నుంచి నెట్టేసిన దుండగులు పరారయ్యారు. శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జులూరుపాడు మండలం కొత్తూరుకు చెందిన వాంకుడోత్ కేతానాయక్ – బాలి వైరాలోని కంటి ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుని స్వగ్రామానికి బయలుదేరారు. వైరా బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తుండగా ఇద్దరు యువకులు వచ్చి తాము కూడా జులూరుపాడు వైపు కారులో వెళ్తున్నామని నమ్మబలికారు. అయితే, తన భార్యకు టికెట్ ఉండదని కేతానాయక్ చెబితే ఒకరి టికెట్ ఇస్తే చాలని కారులో ఎక్కించుకున్నారు. ఆతర్వాత బొమ్మ, బొరుసు ఆట పేరుతో కేతానాయక్‌ను మాటల్లో పెట్టి రూ.100, రూ.500 పందెం కాయించారు. ఆతర్వాత ఆయన భార్య మెడలో బంగారు గొలుసు పెట్టాలని సూచిస్తుండగా వాహనం తల్లాడ దాటి కారు కల్లూరు వైపు వెళ్తుండగా వారు ప్రశ్నిస్తే మళ్లీ ఇక్కడకే వస్తామని చెప్పారు. ఆతకాసేపటికి తల్లాడ ఊరిబయట ఆపి ఓ యువకుడు రూ.2లక్షల బంగారు నాను తాడు, రూ.5వేల నగదు లాక్కుని పరారయ్యాడు. వాహనంలో ఉన్న మరో యువకుడు దంపతులను కిందకు నెట్టేసి వెళ్లిపోయాడు. దీంతో కేతానాయక్, బాలి తల్లాడ పోలీసులను ఆశ్రయించగా.. వైరా సీఐ సాగర్, తల్లాడ ఎస్సై కొండల్‌రావు ఆధ్వర్యాన సీసీ పుటేజీలు పరిశీలించి వాహనాన్ని గుర్తించారు. అలాగే, నిందతుల కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా...

అంబేడ్కర్ వర్సిటీ బీఎడ్ ఎంట్రన్స్ నోటిఫికేషన్

ఫిబ్రవరి 21 వరకు దరఖాస్తులకు గడువు.. మార్చి 5న పరీక్ష



బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఎడ్ (ఓడీఎల్) అర్హత పరీక్ష 2023–24కు నోటిఫికేషన్ విడుదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఫిబ్రవరి 21గా విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష రుసుము రూ.1000, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.750 అని వివరించారు. మార్చి 5వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాల్లో బీఎడ్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారని వెల్లడించారు. విద్యార్థులు పరీక్షకు రెండు రోజుల ముందు హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఆర్ఏఓయూ.ఏసీ.ఇన్ లేదా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఆర్ఏఓయూఆన్‌లైన్.ఇన్‌లో సంప్రదించాలని సూచించారు.

జపాన్‌లో హాస్పిటాలిటీ ఉద్యోగాలకు దరఖాస్తులు

5న నిథిమ్‌లో ఎంపికలు

సాక్షి, హైదరాబాద్: జపాన్‌లో హాస్పిటాలిటీ ఉద్యోగాల భర్తీకి ఆసక్తి ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో డిగ్రీ/డిప్లొమా చేసిన అనువజ్ఞులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఒక ప్రకటనలో తెలిపింది. అభ్యర్థుల కనీస వయసు 22 ఏళ్ల నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలని, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో డిగ్రీ లేదా డిప్లొమా చేసి అనుభవం కలిగి ఉండాలని వివరించింది. ఆసక్తి ఉన్న వారు టామ్‌కామ్ హెచ్‌ఆర్ మేనేజర్ ఫోన్ నంబర్ 8125251408లో సంప్రదించాలని, లేదా ఈమెయిల్ ద్వారా పంపించవచ్చని వివరించింది. ఎంపిక ప్రక్రియను ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథిమ్)లో నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఎంపికైన వారికి జపనీస్ భాషపై రెసిడెన్షియల్ శిక్షణ ఇచ్చి అక్కడ పనిచేసేందుకు అవసరమైన అదనపు నైపుణ్యాలను నేర్పించనున్నట్లు వెల్లడించింది.

కుప్పాన్ని ఎండబెట్టి

కుప్పి గంతులు!

రాజకీయ భిక్ష పెట్టిన పురిటిగడ్డకు చంద్రబాబు నయవంచన

కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా కృష్ణా జలాలను తరలిస్తానంటూ నమ్మక ద్రోహం

- సాగు, తాగునీరు ముసుగులో అంచనా వ్యయం భారీగా పెంపు
- సీఎం రమేష్‌ను అడ్డుపెట్టుకుని ఖజానాకు కన్నం
- కుప్పంను మున్సిపాలిటీగా చేసి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసిన సీఎం జగన్
- కుప్పం బ్రాంచ్ కెనాల్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి కృష్ణా జలాల తరలింపు



కుప్పం బ్రాంచ్ కెనాల్ (ఫైల్)

సాక్షి, అమరావతి: కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా కృష్ణా జలాలను తరలించి సాగు, తాగునీరు అందిస్తానని నమ్మబలికిన స్థానిక టీడీపీ ఎమ్మెల్యే, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ఆ ముసుగులో ఖజానాను దోచేసి పనులు చేయలేక చేతులెత్తేసి నయవంచనకు పాల్పడ్డారు! 2022 సెప్టెంబరు 23న కుప్పం నియోజకవర్గ పర్యటన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. పూర్తయిన కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను ఈ నెలలోనే సీఎం జగన్ ప్రారంభించి నియోజకవర్గ ప్రజలకు అంకితం చేయనున్నారు. ఇప్పటికే రామకుప్పం మండలం వరకూ కృష్ణా జలాలను తరలించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా చెరువులు నింపి సమృద్ధిగా సాగు, తాగునీరు అందించనున్నారు.

పురిటిగడ్డకు ద్రోహం

సొంతూరు నారావారిపల్లె ఉన్న చంద్రగిరి నియోజకవర్గం నుంచి 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన చంద్రబాబు నాడు టీడీపీ అభ్యర్థి మేడసాని వెంకట్రామనాయుడి చేతిలో 17,429 ఓట్ల తేడాతో ఘోరంగా ఓడిపోయారు. ఆ దెబ్బకు 1985 ఎన్నికల్లో పోటీ చేయడానికే జంకిన చంద్రబాబు పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్ పంచన చేరి 1989లో తమిళనాడు, కర్ణాటక, రాష్ట్ర సరిహద్దుల్లోని కుప్పం నియోజకవర్గానికి వలస వెళ్లారు. అప్పటి నుంచి గూండాయిజం, నోట్ల కట్టలు, దొంగ ఓట్లతో నెగ్గుకొస్తున్నారు. దుర్భిక్ష రాయలసీమను సుభిక్షం చేయడానికి జలయజ్ఞంలో భాగంగా దివంగత వైఎస్సార్ చేపట్టిన హంద్రీ–నీవా సుజల స్రవంతిలో అంతర్భాగమైన కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా సాగు, తాగునీరు అందిస్తానని చంద్రబాబు నమ్మబలికారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను 123.641 కి.మీ. పొడవున తవ్వేందుకు 98,85,140 క్యూబిక్ మీటర్ల మట్టి పని, 3,84,457 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేయాలి. 2015–16 ఎస్ఎస్ఆర్ (స్టాండర్డ్ షెడ్యూల్డ్ రేట్స్) ప్రకారం కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో మట్టి, కాంక్రీట్ పనులకు రూ.203.11 కోట్లు ఖర్చు అవుతుంది. మూడు పంప్‌హౌస్‌ల నిర్మాణం, మోటార్లు, ప్రెజర్‌మైన్లు, విద్యుత్ సరఫరా ఏర్పాటుకు రూ.90 కోట్ల వ్యయం అవుతుంది. 2015–16 ధరల ప్రకారం కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు రూ.293.11 కోట్ల వ్యయం అవుతుంది. కానీ అప్పటి సీఎం చంద్రబాబు ఒత్తిడితో పనుల అంచనా వ్యయాన్ని రూ.413 కోట్లకు పెంచేశారు.

కడప టీడీపీ అధ్యక్షుడికి కానుక..

అంచనా వ్యయం పెంచేసిన పనులను కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డికి చెందిన ఆర్కే ఇన్‌ఫ్రాకు కట్టబెట్టి రూ.120 కోట్లు కాజేయడానికి చంద్రబాబు స్కెచ్ వేశారు. ఆ మేరకు కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు రూ.413 కోట్లు అంచనా విలువగా నిర్ణయించి 2015 ఆగస్టులో టెండర్లు పిలిచారు. ఆర్కే ఇన్‌ఫ్రా సంస్థకే పనులు దక్కేలా టెండర్లలో నిబంధనలు పెట్టారు. టెండర్లలో ఆ సంస్థ ఒక్కటే నాలుగు శాతం అధిక(ఎక్సెస్) ధరకు కోట్ చేస్తూ షెడ్యూలు దాఖలు చేసింది. చంద్రబాబు ఒత్తిడి మేరకు ఆర్కే ఇన్‌ఫ్రాకు నాలుగు శాతం అధిక ధరకు రూ.430.26 కోట్లకు పనులు కట్టబెట్టారు. మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద రూ.43 కోట్లు దక్కించుకున్న శ్రీనివాసరెడ్డి వాటిని బాబు జేబులో వేసేశారు. అయితే, శ్రీనివాసరెడ్డికి భారీ ఎత్తున లబ్ధి చేకూర్చుతూ కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు కట్టబెట్టడంపై అప్పటి టీడీపీ ఎంపీ సీఎం రమేష్ పేచీ పెట్టారు. దీంతో శ్రీనివాసరెడ్డికి చెందిన ఆర్కే ఇన్‌ఫ్రాకు 50% పనులు, మిగతా 50% పనులు సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్‌కు సబ్ కాంట్రాక్టు కింద ఇవ్వాలని బాబు ఆదేశించారు. తనతోపాటు శ్రీనివాసరెడ్డి భారీ ఎత్తున లబ్ధి పొందుతుండటాన్ని సహించలేని సీఎం రమేష్ మొత్తం పనులను తనకే కట్టబెట్టాలని మరోసారి పేచీకి దిగారు. దీంతో పనులన్నీ రిత్విక్ ప్రాజెక్ట్స్‌కే అప్పగించేశారు.

రూ.460.88 కోట్లు నీళ్ల పాలు..

కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో సీఎం రమేష్ సంస్థకు రూ.460.88 కోట్లను 2019 ఏప్రిల్ నాటికి ప్రభుత్వం బిల్లుల రూపంలో చెల్లించింది. అంటే కాంట్రాక్టు విలువ కంటే రూ.30 కోట్లు ఎక్కువగా చెల్లించినా పనులు పూర్తి కాలేదు. రూ.99.41 కోట్ల విలువైన పనులు మిగిలిపోయాయి. నాసిరకమైన పైపులు వేయడం వల్ల వర్షపునీటికే పగిలిపోయాయి. దీన్ని బట్టి కుప్పం బ్రాంచ్ కెనాల్ పనుల్లో సీఎం రమేష్‌తో కలిసి చంద్రబాబు ఏ స్థాయిలో దోపిడీకి పాల్పడ్డారో విశదం చేసుకోవచ్చు. వరుసగా ఏడుసార్లు గెలిపించిన కుప్పం ప్రజలకు సాగునీటి మాట దేవుడెరుగు గుక్కెడు తాగునీళ్లు కూడా అందించకుండా చంద్రబాబు నమ్మకద్రోహం చేశారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్..

ముఖ్యమంత్రి జగన్ అధికారం చేపట్టాక ప్రతిపక్షనేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం బాగోగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కుప్పంను మున్సిపాలిటీని చేశారు. కుప్పం కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో అంతర్గత రహదారులు, తాగునీరు లాంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేసి కృష్ణా జలాలను అందించి సుభిక్షం చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చారు. మాట నిలబెట్టుకుంటూ యుద్ధప్రాతిపదికన కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను పూర్తి చేయించారు. ఇప్పటికే కుప్పం బ్రాంచ్ కెనాల్ 74 కి.మీ. వరకూ అంటే రామకుప్పం మండలం మనేంద్రం గ్రామం వరకూ కెనాల్ నీటిని తరలించారు. చెరువులను నింపి సాగు, తాగునీరు అందించనున్నారు.

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తల నియామకం

- ఆరో జాబితాలో ఆరు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు ఎంపిక
- రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ సలహాదారు సజ్జల వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో ఆరు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఆ వివరాలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద శుక్రవారం సాయంత్రం వెల్లడించారు. ప్రజాబలమే గీటురాయిగా.. సామాజిక న్యాయం పాటిస్తూ... ఆరో జాబితా తయారు చేసినట్టు ఈ సందర్భంగా వారు తెలిపారు. గత ఎన్నికల్లో నర్సాపురం లోక్‌సభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా... ఈ సారి బీసీ వర్గానికి చెందిన మహిళా అడ్వొకేట్ గూడూరి ఉమాబాలను ఎంపిక చేశారు. రాజమండ్రి లోక్‌సభ స్థానానికి డాక్టర్ గూడూరి శ్రీనివాస్(బీసీ)ను, గుంటూరుకు ఉమ్మారెడ్డి రమణ, చిత్తూరుకు సిటింగ్ ఎంపీ ఎన్.రెడ్డప్పను ఎంపిక చేశారు. గత ఎన్నికల్లో మైలవరం శాసనసభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఈ సారి సర్నాల తిరుపతిరావు యాదవ్(బీసీ)ను నియమించారు. గత ఎన్నికల్లో ఎమ్మిగనూరు శాసనసభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఇప్పుడు మాజీ ఎంపీ బుట్టా రేణుకను నియమించారు. మార్కాపురానికి ఎమ్మెల్యే అన్నా రాంబాబు, గిద్దలూరుకు ఎమ్మెల్యే కె.నాగార్జునరెడ్డి, గంగాధర నెల్లూరు(ఎస్సీ)కు డిప్యూటీ సీఎం కె.నారాయణ స్వామి, నెల్లూరు సిటీకి ఎండీ ఖలీల్‌ను నియమించారు. ఇప్పటివరకూ 63 శాసనసభ, 16 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తలను కొత్తగా నియమించినట్టయింది. ఇప్పటిదాకా ప్రకటించిన శాసనసభ స్థానాల సమన్వయర్తల్లో 21 మంది ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, 18 మంది బీసీలు, ఐదుగురు మైనార్టీలు, 16 మంది ఓసీలకు చెందిన వారు ఉన్నారు. 16 లోక్‌సభ స్థానాలకు నియమించిన సమన్వయకర్తల్లో బీసీలు తొమ్మిది మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ఓసీలు నలుగురు ఉన్నారు.

వ్యవసాయ, ఉద్యాన వర్సిటీ వీసీల నియామకానికి నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ల నియామకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు నోటిఫికేషన్ విడుదల చేశారు. వీసీగా నియామకమయ్యే అభ్యర్థులు యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా కనీసం 10 ఏళ్ల పాటు పనిచేసి ఉండాలి. అభ్యర్థుల వయోపరిమితి 65 ఏళ్లకు మించకుండా ఉండాలి. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో వెల్లడించారు.

కాపాడలేం.. అమ్మేద్దాం!

▶ మొదటి పేజీ తరువాయి

వెల్లడించింది. తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేయటంతో ఈ అంశం అలాగే తొమ్మిదో షెడ్యూల్‌లో తెగని పంచాయితీగా ఉండిపోయింది. హైకోర్టులో కేసు కూడా కొనసాగుతోంది. ఇలాంటి తరుణంలో సదరు భూములను అమ్మేయాలని తెలంగాణ సర్కారు నిర్ణయించడం చర్చనీయాంశంగా మారుతోంది.

కాపాడలేమంటూ కేంద్రం దృష్టికి..

హౌసింగ్‌బోర్డు, దిల్ భూములు కీలక ప్రాంతాల్లో ఉండటంతో వాటిపై కబ్జారాయుళ్ల దృష్టి పడింది. ఇప్పటికే చాలా భూములపై వివాదాలు మొదలయ్యాయి. ఈ భూముల విక్రయానికి ప్రక్రియ మొదలుపెట్టగానే.. అభ్యంతరాలు వస్తాయని, కోర్టులో కేసు ఉండగా ఎలా అమ్ముతారన్న ప్రశ్న వస్తుందని సర్కారు ముందుగానే అంచనా వేసింది. ఈ క్రమంలోనే ఇటు కోర్టుకు, అటు కేంద్ర ప్రభుత్వానికి కూడా ఈ భూముల పరిరక్షణ సవాల్‌గా మారిందన్న విషయాన్ని తెలియపర్చాలని భావిస్తోంది. ''ఇప్పటికే చాలా భూములు వివాదంలో ఉన్నాయి. వాటితోపాటు క్లియర్‌గా ఉన్న మిగతా భూములను పరిరక్షించటం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. కబ్జాలు ఇంకా పెరిగి వివాదాలు కోర్టుల్లో పెరిగేంత వరకు ఉపేక్షించటం సరికాదు. ఈ భూములకు సంబంధించి కోర్టు ఏ నిర్ణయం తీసుకున్నా అనుసరిస్తాం. ముందు వాటిని వేలం ద్వారా విక్రయించి, వచ్చిన డబ్బును తదనుగుణంగా వినియోగించుకోవచ్చు. అందుకు వీలు కల్పించాలి''అని కోర్టును కోరాలని యోచిస్తోంది. కేంద్రానికి కూడా ఇదే వివరించాలని.. ఈ మొత్తం వ్యవహారాన్ని ఢిల్లీ స్థాయిలో పర్యవేక్షించేందుకు ఓ ప్రతినిధిని కూడా నియమించాలని రాష్ట్ర సర్కారు భావిస్తున్నట్టు సమాచారం.

జిల్లా వార్తలు

ఐటీడీఏలో స్క్రాప్‌కు వేలం

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏలో ఉన్న స్క్రాప్‌ను ఈనెల 10న బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు పీఓ ప్రతీక్‌జైన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పాత కంప్యూటర్ చైర్స్, ప్రింటర్, యూపీఎస్, మానిటర్లు, జిరాక్స్ మిషన్ తదితర సామగ్రిని ఈనెల 10న మధ్యాహ్నం బహిరంగ వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి



పశు వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న కిషోర్

చంద్రుగొండ: పాడిపశువుల పెంపకంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ కె.కిషోర్ సూచించారు. చంద్రుగొండ మండలంలోని గుర్రాయిగూడెంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పశు వైద్యశిబిరంలో పశువులకు వైద్యం అందించడమే కాక కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడలను పరిశీలించారు. ఈసందర్భంగా కిషోర్ మాట్లాడుతూ పశువులకు నాటు వైద్యం చేయించకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండల పశువైద్యాధికారి ఎల్‌వీఎస్.రాంప్రసాద్, ఉద్యోగులు బి.సాయి, యాదగిరి, రాము, నరేష్, ఆకుల శ్రీనివాసరావు, వెంకటదాసు, ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వద్దకే పోస్టాఫీస్!



ఖాతా కోసం వివరాలు నమోదు చేస్తున్న ఉద్యోగులు

రఘునాథపాలెం: ఉపాధి హామీ పథకంలో పనులు చేసే కూలీలకు నగదు ఖాతాల్లో జమ అవుతోంది. ఇందుకోసం కూలీలు పోస్టాఫీస్‌కు వెళ్లి ఖాతా తెరవాల్సి వస్తోంది. ఫలితంగా ఒక రోజు పని కోల్పోతున్నారు. దీంతో పోస్టల్ ఉద్యోగులే శుక్రవారం రఘునాథపాలెం వచ్చి కూలీల పేరిట ఖాతాలు తెరిచారు. దీంతో తమకు శ్రమ తప్పినట్లయిందని కూలీలు హర్షం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ డెయిరీతో పాలధారలు!

- మహిళలు, యువతకు ఉపాధి కూడా...
- ఇటీవల అధికారులతో సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి
- గతంలో సభ్యులుగా 4,133 మంది మహిళలు, రూ.36 లక్షల డిపాజిట్
- డిప్యూటీ సీఎం కల ఫలిస్తే మహిళలు, యువత ఆర్థికాభివృద్ధి



ఇందిరమ్మ డెయిరీ ఏర్పాటుపై కలెక్టర్, అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క (ఫైల్)



పాడి గేదెలు

ఎర్రుపాలెం: ఇందిరమ్మ డెయిరీ పేరిట పాడి పరిశ్రమ ఏర్పాటు చేసి మహిళలు, యువతకు ఉపాధి కల్పించాలనే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పదేళ్ల కల త్వరలోనే సాకారం కానుంది. మధిర నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లోని డ్వాక్రా మహిళల ద్వారా ఇందిరమ్మ డెయిరీ పరిశ్రమ ఏర్పాటుచేసి వారికి ఉపాధి కల్పిస్తే ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని.. యువతకు ఉపాధి సైతం లభిస్తుందని భట్టి డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నప్పుడు కార్యాచరణ సిద్ధం చేశారు. ఆతర్వాత కాంగ్రెస్ అధికారంలోకి కోల్పోగా ఈ ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడం భట్టికి డిప్యూటీ సీఎంగా పదవి దక్కడంతో ఇందిరమ్మ డెయిరీ ప్రతిపాదనలు మళ్లీ తెరపైకి వచ్చాయి.

డెయిరీ ఏర్పాటు ఉద్దేశమిదీ..

ప్రతి మహిళకూ రెండు పాడి గేదెలను బ్యాంకు లింకేజీ రుణం ద్వారా ఇప్పిస్తారు. తద్వారా పాడి పరిశ్రమను వృద్ధి చేసి తద్వారా మహిళలకు ఆర్థిక చేయూతనందించాలన్నది డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భావన. గ్రామాల్లో మహిళలు పాడి గేదెలు కొనుగోలు చేసేలా రుణాలు ఇప్పించడం. యువత ద్వారా పాల సేకరణ, పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయిస్తే ఇరువర్గాలకు ఉపాధి లభిస్తుంది. ఇందులో భాగంగా జనవరి 6వ తేదీన ఎర్రుపాలెం మండలంలోని మామునూరులో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఇతర అధికారులతో సమీక్షించిన భట్టి డెయిరీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. త్వరలోనే జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించి డెయిరీ ఏర్పాటుకు అడుగులు పడే అవకాశముంది.

పదేళ్ల క్రితమే సభ్యత్వాలు

2012–2013 సంవత్సరంలో ఇందిరమ్మ డెయిరీ(పాల శీతలీకరణ కేంద్రం) ఇండస్ట్రీ కోఆపరేటివ్ సొసైటీని అప్పటి డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే భట్టి విక్రమార్క ఆదేశాలతో ఐకేపీ సిబ్బంది ఏర్పాటు చేశారు. మధిర నియోజవర్గ పరిధిలోని ఎర్రుపాలెం మండలంలో 601 మంది, మధిర మండలంలో 745 మంది, బోనకల్‌లో 908, చింతకానిలో 924, ముదిగొండలో 955 మంది మొత్తం 4,133 మహిళలు రూ.100 సభ్యత్వ రుసుము చెల్లించి సభ్యులుగా చేరారు. అలాగే, వాటా మూలధనంగా కొందరు రూ.500, మరి కొందరు రూ.వెయ్యి చెల్లించారు. ఈ నగదు మొత్తం రూ.29.70లక్షలు కాగా మధిరలోని రెండు జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేశారు. ప్రస్తుతం ఆ నిధులు రూ.36లక్షలకు చేరాయి. దీంతో ఇందిరమ్మ డెయిరీ త్వరగా ఏర్పాటుచేసి మండలాల్లోని సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులందరినీ భాగస్వాములు చేసేలా కార్యాచరణ సిద్ధమవుతోంది. తద్వారా ఐదు మండలాల పరిధి 5,884 గ్రూపుల్లోని 61,409 మహిళలను డెయిరీ పరిశ్రమలో సభ్యులుగా చేర్పించి వాటా మూలధనం సేకరిస్తే పరిశ్రమ ఏర్పాటు సులువు కానుంది.

పాడి పరిశ్రమ ఏర్పాటుతో ఉపాధి



ఇందిరమ్మ డెయిరీ ఏర్పాటైతే ఇక్కడి మహిళలకు ఆర్థికపరమైన చేయూత లభిస్తుంది. గ్రామాల్లో పాల ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయి. యువత ద్వారా గ్రాసం కేంద్రాల ఏర్పాటు, పాల సేకరణ చేయిస్తే వారికీ ఉపాధి లభిస్తుంది.

– శీలం కనకదుర్గ, గ్రామ దీపిక, తెల్లపాలెం

త్వరలోనే అధికారులతో సమీక్ష



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు త్వరలోనే జిల్లాకేంద్రంలో కలెక్టర్ ఆధ్వర్యాన ఐకేపీ, పశు సంవర్థక శాఖ, బ్యాంకు అధికారులతో సమావేశం జరగనుంది. డెయిరీ పరిశ్రమ ఏర్పాటుకు తరఫున ప్రణాళిక రూపొందిస్తున్నాం.

– విద్యాచందన, డీఆర్‌డీఓ, ఖమ్మం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..



ఎర్రుపాలెం మండలంలో 11,632 మంది మహిళలు ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులుగా ఉండగా.. 601 మంది ఇందిరమ్మ డెయిరీలో సభ్యులుగా కొనసాగుతున్నారు. ప్రభుత్వ విధివిధానాల మేరకు అందరినీ భాగస్వాములుగా చేస్తాం.

– కె.వెంకటేశ్వర్లు, ఏపీఎం, ఐకేపీ, ఎర్రుపాలెం

'సఖి'తో గిరిజన మహిళల్లో చైతన్యం

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: మారుమూల ఆదివాసీ, గిరిజన గ్రామాలలోని నిరుపేదలైన మహిళలకు ఉన్న హక్కులు, చట్టాలపై సఖి–వన్ స్టాప్ కేంద్రం ద్వారా చైతన్యం కల్పించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. సఖి సెంటర్ నిర్వాహకులు రూపొందించిన పోస్టర్లను శుక్రవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో మహిళలు నిరక్షరాస్యత కారణంగా అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. ఈ మేరకు వారికి ఉన్నహక్కులపై అవగాహన కల్పించాలని, తద్వారా నష్టపోకుండా చూడాలని సూచించారు. భద్రాద్రి జిల్లా సఖి–వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శుభశ్రీ మాట్లాడుతూ బాధిత మహిళలకు అత్యవసర పరిస్థితుల్లో వైద్యం, పోలీస్, న్యాయ సేవలు అదందిస్తున్నామని తెలిపారు. ఈమేరకు సేవలు అవసరమైన వారు హెల్ప్‌లైన్ నంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాజమణి తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. చిన్నఫకీరయ్య



చిన్నఫకీరయ్యను సన్మానిస్తున్న గ్రామస్తులు

ముదిగొండ: ముదిగొండ మండలం గంధసిరిలో కూలీలతో వెళ్తున్న ఆటో గురువారం సాయంత్రం వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిన విషయం విదితమే. అందులో ఉన్న కొందరు కూలీలకు ఈత రావడంతో బయటపడగా.. మిగతా వారు ఆపదలో చిక్కుకున్నారు. దీంతో అదే సమయాన సమీపంలో ఉన్న గ్రామానికి చెందిన రైతు కుక్కల చిన్నఫకీరయ్య కూలీల కేకలు వినగానే పరుగున అక్కడకు చేరుకున్నారు. బావి నిండా నీరు ఉన్నప్పటికీ అధైర్యపడకుండా దూకి ఎనిమిది మంది కూలీలను బయటకు తీసుకొచ్చాడు. ఈమేరకు చిన్నఫకీరయ్యను నాయకులు, గ్రామస్తులు శుక్రవారం గ్రామంలో ఘనంగా సన్మానించారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ధైర్యం చేసిన ఆయనను అభినందించారు.

'భద్రాద్రి'కి పోటెత్తుతున్న భక్తులు

- జనవరిలో స్వామిని దర్శించుకున్న 3 లక్షల మంది
- అత్యధికంగా 27వ తేదీన 16,696 మంది భక్తుల రాక



గత నెల 27న స్వామి కల్యాణానికి హాజరైన భక్తులు(ఫైల్)

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. ముక్కోటి, శ్రీరామనవమి ఉత్సవాల సమయాన భక్తులు అధిక సంఖ్యలో రావడం ఆనవాయితీ. మిగతా సమయాల్లో భక్తుల సంఖ్య తక్కువగానే ఉంటుంది. కానీ జనవరి నెలలో మాత్రం సుమారు 3లక్షల భక్తులు స్వామిని దర్శించుకోవటం విశేషం.

అత్యధికంగా జనవరి 27వ తేదీన 16,696మంది, అత్యల్పంగా 30వ తేదీన 5,314 మంది దర్శించుకున్నారు. జనవరిలో వారాంతపు సెలవులతో పాటుగా ఇతర సెలవులు రావడంతో భక్తుల రద్దీ నెలకొందని భావిస్తున్నారు. స్వామిని దర్శించుకోవడమే కాక నిత్యకల్యాణంలో పెద్దసంఖ్యలో జంటలు పాల్గొంటున్నాయి. దీంతో జనవరిలో కొన్నిసార్లు నిత్యకల్యాణ క్రతువును చిత్రకూట మండపంలో నిర్వహించాల్సి వచ్చింది.